



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## - 1-

తెలుగు పత్రిక అంటే... దిన పత్రిక, వార పత్రిక, పక్ష పత్రిక, మాస పత్రిక, అంతర్జాల పత్రిక ఏదైనా కావచ్చు. అలాగే, వార్త పత్రికలూ, సాహిత్య పత్రికలూ, సినిమా పత్రికలూ, పిల్లల పత్రికలూ ఇలా ఏ వర్గానికి చెందినవి అయినా కావచ్చు.

శతాబ్దాల తెలుగు పత్రికలు అంటున్నాను కాబట్టి, దాదాపు 200 వందల సంవత్సరాల నుండి మొట్ట మొదటి పత్రిక నుండి మొదలుపెడతాను. ఈ అంశం ఎంచుకోవడానికి ముఖ్య కారణం ఏమిటంటే.. ఒక జాతి చరిత్ర గానీ, ఒక సమాజ చరిత్ర గానీ, ఒక దేశ చరిత్ర గానీ, వాటిని అక్షర బద్దం చేయడంలో పత్రికలు ప్రముఖ పాత్ర

వహించాయి. అంతే కాకుండా వాటిని ముందు తరాలకు అందించడంలో పత్రికల పాత్ర ఎంతయినా వుంది. ఎప్పుడైనా ఏ పత్రికైనా సమకాలీన సమాజానికి నిజమైన దర్పణంగా ఉంటుంది.

40 సంవత్సరాల క్రితం పత్రికలు చూసుకుంటే, అప్పటి సమాజం ఎలా ఉందీ? అప్పటి ప్రజల జీవన విధానాలు ఎలా వున్నాయి? అనేది అప్పటి పత్రికలు చూస్తే, తెలుస్తుంది. అలాగే ఇప్పటి పత్రికలు చూస్తే, ఇప్పటి జీవన విధానం ఎలా ఉందీ ? ఇప్పటి ప్రజలు ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారు?ఇప్పటి సాంకేతికత అనే అంశాలు అర్థమౌతాయి.

గత 200 సంవత్సరాలుగా తెలుగు భాష ఎలా మారుతూ వచ్చింది?తెలుగు సాహిత్యంలో ఎలాంటి క్రమ పరిణామాలు సంభవించాయి? భారతదేశంలోనూ, ఆంధ్రదేశం లోనూ రాజకీయాలు ఎలాంటి దశలు దాటుకుంటూ వచ్చాయి? చరిత్రలో ముఖ్యమైన సంఘటనలు జరిగిన రోజు అంటే, ఉదాహరణకు అల్లూరి సీతారామరాజు మరణించిన రోజు,సుభాష్ చంద్ర బోస్ ఇంట్లో నుండి పారిపోయిన రోజు, భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన రోజు, గాంధీ మహాత్ముడు మరణించిన రోజు, ఆంధ్ర రాష్టం ఏర్పడినప్పుడు ఇలాంటి ముఖ్యమైన సంఘటనలు జరిగినప్పుడు ఆనాటి సమాజ ఆనాటి సమాజ స్పందన ఎలా వుంది? ఇలాంటి విశేషాలు తెలుసుకోవాలంటే, ఆనాటి పత్రికలే ఆధారం.

అలాగే గత 30 సంవత్సరాలుగా – 1990 నుండి టి. వి., ఇంటర్ నెట్ వచ్చాక – ప్రింట్ పత్రికల ప్రభావం, వాటి ప్రభంజనం తగ్గింది గానీ, అంతకు ముందు తెలుగు వారి ప్రధాన కాలక్షేపం సినిమాలూ, రేడియోలూ , వాటితో పాటు పత్రికలూ. పత్రికల్లో కథలూ, సీరియల్సూ సాహిత్య విశేషాలూ.. పత్రిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేవారు.

పత్రికల్లో వచ్చిన సీరియల్ పేజీలు చించి, దాచుకొని, వాటిని బైండ్ పుస్తకాలుగా కొట్టుకొని దాచుకోవడం నిన్నటి తరానికి ఒక తియ్యని జ్ఞాపకాలు. 1932 నాటి టాకీ సినిమాలూ, 1936 ప్రాంతాల్లో రేడియో మొదలైతే, అంతకు ముందు 100 సంవత్సరాల ముందే తెలుగు పత్రికలు వున్నాయి.


ఇన్నాళ్ళుగా నేను చెబుతున్న టాక్ షో లలో అనేక విషయాలు నిర్ధారించుకోవడానికి కూడా నేను పాత పత్రికలనే ఆధారం చేసుకుంటూ వచ్చాను. అనేక దశాబ్దాల క్రిందటి తెలుగు పత్రికలూ, వాటిలోని అనేక అంశాలూ చదువుతుంటే, చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఆ క్రమంలో అసలీ పత్రిక ఎప్పుడు మొదలయ్యిందీ? ఎవరు ప్రారంభించారు? దీని వెనుక వున్న కథ ఏమిటి? ఇలాంటివన్నీ కొంచెం పరిశీలనా దృష్టితో చూసినప్పుడు చాలా ఆసక్తికరంగా తోచి వీటిని పాఠకులతో పంచుకోవాలని అనిపించింది. అదే ఈ రచనకు ముఖ్యమైన ప్రేరణ.

అలాగే తెలుగు పత్రికల చరిత్ర గురించి, నాకు అంతర్జాలంలో, ఆడియో రూపంలో నాకు ఏ కార్యక్రమం కనిపించలేదు. ఆ కోణంలో కూడా తెలుగు పత్రికల చరిత్రకు రచనా రూపంలో శాశ్వతత్వం కల్పించాలి అనుకోవడం కూడా ఈ వ్యాస పరంపరకు ముఖ్య కారణం.


ఈ సమాచార సేకరణకు కొన్ని వందల పత్రికలు తిరగేసాను. వాటితో పాటుగా "తెలుగు పత్రికల సాహిత్య సేవ" అనే డా:తిరుమల రామచంద్రగారు వ్రాసిన ఒక చిన్న పుస్తకం నుండి కూడా కొంత ప్రాధమిక సమాచారం తీసుకున్నాను. మిగతా అంతా కూడా నేను స్వంతంగా పరిశోధించిన, విశ్లేషించిన సమాచారమే.

అలాగే ఒక పత్రిక గురించి చెప్పేటప్పుడు, ఆ పత్రిక పుట్టు పూర్వోత్తరాలూ, నేపథ్య కథనాలూ ఆ పత్రికలోని ముఖ్యమైన అంశాలు అవసరమైనంత మేరకు చెబుతాను. ఈ వ్యాసపరంపర గురించి, పాఠకులకు కొంతవరకూ అంచనా ఇవ్వడం కోసమే ఇంత చెప్పవలసి వచ్చింది. ఇక "శతాబ్దాల తెలుగు పత్రికలూ – తీరుతెన్నులూ" ప్రధాన అంశాలను ప్రారంభిస్తాను.

దాదాపు 200 సంవత్సరాల నాటి తెలుగు పత్రికల చరిత్రను నేను కొన్ని భాగాలుగా వర్గీకరించాను..





1. "ప్రారంభం – ప్రయోగాత్మకం (1832 నుండి 1900 వరకూ) ఈ కాలంలో వచ్చిన కొన్ని పత్రికలు 1, వృత్తాంతిని, 2. హిత వాది, 3. వర్తమాన తరంగిణి, 4. సుజన రంజని 5. చింతామణి, 6. వివేకవర్ధినీ ఇలా.. వీటిల్లో కొన్ని ముఖ్యమైన పత్రికల గురించి ప్రస్తావిస్తాను.




2. అభ్యుదయం – అమూల్యం – అనుభవసారం (1900 నుండి 1950 వరకూ) 1. కృష్ణా పత్రిక, 2. ఆంధ్ర పత్రిక, 3. భారతి, 4. గృహ లక్ష్మి, 5. ఉదయినీ, 6. సమదర్శినీ 7. ఆంధ్ర ప్రభ 8. యువ ఇలాంటివి..




3. వ్యాపారాత్మకం– అయినా విలువలకే ప్రాధాన్యం (1950 నుండి 1980 వరకూ) 1. యువ, 2. జయశ్రీ, 3. ఆంధ్రజ్యోతి, 4. జ్యోతి, 5. విజయ చిత్ర, 6. సినిమా రంగం, 7. విజయ, 8. ఈనాడు .. మొదలైనవి




4. మహోధృతం – మరో ప్రపంచం(1980 నుండి 1990 వరకు) 1. స్వాతి, 2. ఆంధ్రభూమి, 3. ఉదయం, 4.పల్లకి , 5. ఎన్–కౌంటర్, 6. శివరంజని, 7. వారం–వారం, 8. విపులా, 9..చతురా, 10. జ్యోతి చిత్ర ఇలా..







5. చల్లారిన వేగం – తగ్గిపోయిన పాఠక లోకం (1900 తర్వాత)

ఈ 30 సంవత్సరాల్లో వచ్చిన పత్రికలు అంతకు ముందు వచ్చిన పత్రికలతో పోలిస్తే, తక్కువ సంఖ్యలో వచ్చాయి. స్వాతిలాంటి ఒకటి రెండు పత్రికలు తప్ప, చాలా కాలం నుంచి వస్తున్న పత్రికలు చాలా వరకూ ఆగిపోయాయి. ఈ సంక్షోభం మొదలవ్వడానికి ముందు వరకూ వున్న పత్రికల గురించి మాత్రమే ప్రస్తావిస్తాను.

2000 సంవత్సరం తర్వాత ఒక కొత్త విభాగం మొదలయ్యింది. అదే “అంతర్జాలం –ఇదో ప్రపంచం” అంటే, ప్రింట్ పత్రికలు కాకుండా వెబ్ లో మాత్రమే వుండే పత్రికలు ఈ మాట, సుజన రంజని, మధుర వాణి , మాలిక, నెచ్చెలి, కౌముది, సారంగ, గో–వెలుగు.కామ్ ఇలాంటివి చాలా వున్నాయి. ఇవండీ, స్థూలంగా నేను వివరించిన వర్గాలు.

వీటిల్లో చివరి భాగం అయిన అంతర్జాల పత్రికల గురించి వదిలేసి, మిగిలిన భాగాల గురించి చెబుతాను. బహుశా కొన్ని విభాగాల గురించి కాస్త ఎక్కువగా చెప్పవలసి రావచ్చు. మొట్ట మొదటి విభాగం నుండి ప్రారంభిద్దాం.

1832 నుండి 1900 వరకూ వచ్చిన తెలుగు పత్రికలు దాదాపు ప్రతీదీ ఒక ప్రయోగం అనుకోవచ్చు. అంటే, పత్రిక ఎలా ఉండాలి? అందులో ఏయే అంశాలు ఉండాలి? ఇలాంటివన్నీ ఎవరికి వారు నిర్ణయించుకున్నవే. వాళ్లకు మార్గ దర్శకత్వం ఏమీ లేదు. పైగా ఆ రోజుల్లో నవలా, కథా, వచన కవిత్వం లాంటివి ఏమీ లేవు. ఆ దశాబ్దాలలో అంటే 1830 నుండి 1900 వరకూ ప్రతి గొప్ప పండితుడూ, కవీ ఒక్కో సాహిత్య పత్రికను నిర్వహించాడు.

కందుకూరి వీరేశలింగంగారు, కొక్కొండ వెంకట రత్నంగారు, వేదం వెంకట రాయశాస్త్రిగారు, చిలకమర్తి వారూ ఇలా వీళ్లంతా పత్రికలు స్థాపించిన వాళ్ళే. అవి ఎంత కాలం నిలబడ్డాయన్నది వేరే అంశం అనుకోండి. అందుకే ప్రయోగాత్మకం అన్నాను. విశేషం ఏమిటంటే, మొట్ట మొదటి స్త్రీల పత్రికా , మొట్టమొదటి బాలల పత్రికా, మొట్ట మొదటి విద్యార్థుల కోసం పత్రికా, మొట్ట మొదటి రైతుల కోసం పత్రికా, మొట్ట మొదటి సైన్సు పత్రికా ఇలాంటి ప్రయోగాలన్నీ కూడా 1900 ముందే జరిగాయనేది మనం గమనించాల్సిన అంశం. ఈ పత్రికల్లో వ్యాపారాంశాలు తక్కువగా ఉండేవి.

పత్రికలూ నడిపి , డబ్బు గడిద్దాం అనే వంటి దృష్టి ఆనాడు ఉన్నట్లు ఎక్కడా కనిపించదు. వివరాల్లోకి వెళదాం.

భారత దేశంలోనే మొట్టమొదటి పత్రికలు బెంగాల్ భాషలో వచ్చాయి. బెంగాల్ గెజిట్(1816 లో) డిక్టర్సెన్ 1818 లోనూ బెంగాల్ సిరంపూర్ లో మొదలయ్యాయి. అంటే, అంతకు ముందు పత్రికలు లేవా?అంటే, భారతీయులు ప్రారంభించిన పత్రికలు లేవు. అంతకు ముందు నుండి ప్రింటింగ్ మిషన్లు వున్నాయి. అలాగే ఆంగ్లేయులు ప్రారంభించిన ఆంగ్ల పత్రికలు వున్నాయి గానీ, భారతీయులు ప్రారంభించిన పత్రికలు మాత్రం బెంగాల్ లో 1816 లోనే ప్రారంభం అయ్యాయి.

మన అంశం తెలుగు పత్రికలు కాబట్టి, తెలుగులో మొట్టమొదటి పత్రిక ఏది? అనే విషయానికి వస్తే, దానిమీద భిన్నాభిప్రాయాలు వున్నాయి. ఆయా పత్రిక ప్రతులు కూడా లభ్యం కావడం లేదు. అవి లభ్యం కానప్పుడు వాటి గురించిన వివరాలు ఎలా తెలుస్తాయి? వాటి గురించి ఎవరైనా, ఎక్కడైనా ప్రస్తావిస్తే “ఓహో! ఫలానా కాలంలో, ఫలానా పత్రిక ఉండేది కామోసు. అందువల్ల అక్కడ రాశారు ” అనే వంటి నిర్ణయానికి రావాలి.

అలా చూస్తే, 1829 లో బెంగాల్ ప్రభుత్వానికి ‘మద్రాస్ క్రిస్టియన్ ఫాదర్ ‘ ఒక నివేదిక పంపించాడు. దాంట్లో “ఒక తమిళ , ఒక తెలుగ పత్రికలకు నేను అనుమతి ఇచ్చాను. “అని రాశాడు.

అలాగే 1833 నవంబర్ లో లండన్ నుండి ‘ఏషియాటిక్ జర్నల్ ‘ అనే పత్రికలో ఒక వార్త వచ్చింది. దాన్లో “మద్రాస్ నుండి తెలుగు, తమిళ , ఇంగ్లీష్ లలో ఒక పత్రిక వస్తోంది.ఈ పత్రికలో ఎక్కువగా ఇంగ్లీష్ నుండి తెలుగు,

తమిళం లోకి అనువదింప బడ్డాయి.“ అని ఒక వార్త వుంది. దానిపేరు కొంత మంది “కర్ణాటక క్రానికల్” అంటారు. మరి కొందరు “మద్రాస్ క్రానికల్ “అంటారు. మరి ఆ పత్రిక ప్రతులు లేవు కాబట్టి, “అవి అసలు లేనే లేవు “ అంటారు. మరి కొంత మంది “వున్నాయి”అంటారు. ఆ వివాదాల్ని పక్కన పెట్టి, దాన్ని నమ్మితే మొట్టమొదటి పత్రిక 1829, 30 ప్రాంతాల్లో వచ్చింది అని ఒప్పుకోవాలి.

తరువాత నిర్ధారణ కానీ, మరొక పత్రిక విషయం ఏమిటంటే.. 1832 లో “సత్య దూత”అనే పత్రిక బళ్లారి నుండి వచ్చింది. క్రైస్తవ సంఘం వారు దాన్ని ప్రారంభించారు అన్నది ఒక వార్త. దీన్ని కూడా కొంత మంది “లేదు మేం చూడలేదు. “అంటారు. మరి కొంత మంది “మద్రాస్ ఆర్కైవ్స్“ లో వుంది అంటారు. అలా అనుకుంటే “సత్య దూత”పత్రిక కూడా 1832 లో వచ్చింది. అది పూర్తిగా క్రైస్తవ మత సంబంధమైన పత్రిక.

ఈ రెండు సందిగ్ధాలనూ పక్కన పెడితే అందరూ ఖచ్చితంగా వుంది అనుకున్న పత్రిక “వృత్తాంతిని”. అది 1838 నుండి 1841 వరకూ 3 సంవత్సరాలు మాత్రమే వచ్చింది. ఆ పత్రిక కాపీలు ఎక్కడా లేవు. మరి ఆ పత్రిక ఉన్నట్లు ఎలా తెలుస్తుంది? ఆ రోజుల్లో రాజమండ్రిలో “జేమ్స్ థామస్”అనే ఆయన జిల్లా జడ్జిగా ఉండేవారు. వాళ్ళావిడ పేరు “జూలియా థామస్”. ఆవిడ ఇంగ్లాండ్ లో వుండే వాళ్ళ బంధు మిత్రులకు ఉత్తరాలు రాస్తూ ఉండేది. ఈ ఉత్తరాలు అన్ని కూడా తరువాత పుస్తకాలుగా కూడా వచ్చాయి.

1819 జనవరి 19న ఆ జూలియా థామస్ రాసిన ఉత్తరంలో ఏం రాసిందంటే.. (అది ఇంగ్లీష్ లో ఉంటుంది. నేను తెలుగులో చెబుతాను.)

“ఇక్కడ భారతీయులు ఒక పత్రికను మద్రాస్ నుండి తీసుకువచ్చారు. అది చూడడానికి చాలా తక్కువ స్థాయిలో వుంది. దాంట్లో కొన్ని అంశాలు చూస్తే, చాలా హాస్యాస్పదంగా వున్నాయి. అందులో ఇంగ్లీష్ రాణి పడుకునే పరుపు చాలా గట్టిగా ఉంటుందని రాశారు. అంటే, ఆమె ఎప్పుడూ ఒకే పరుపుపై పడుకుంటుందని వాళ్ళ ఉద్దేశ్యం. అలాగే గవర్నర్ గారు విందు ఇచ్చినపుడు స్థానికుల్ని కూడా పిలిచారని రాసారు. అదేదో వార్త అయినట్లు.”

ఇలా కొంత వేళాకోళంగా, కొంత హాస్యాస్పదంగా రాసింది. ఎలా రాసిందనే విషయం పక్కనపెడితే, ఆవిడ రాసిన విషయాన్ని బట్టి, 1838, 42 ప్రాంతాలలో ఒక పత్రిక ఉండి, ఉంటుంది. అని ఖచ్చితంగా చెప్పవచ్చు. దీనిని ఒక నిర్ధారణగా ఇవ్వడానికి కారణం ఏమిటంటే, గిడుగు రామమూర్తి పంతులు గారు “గద్య చింతామణి“ అనే పుస్తకంలో ఈ “వృత్తాంతిని “అనే పత్రికలో వచ్చిన ఒక ఉత్తరాన్ని వేశారు. దాన్ని బట్టి కూడా ఈ “వృత్తాంతిని“ అనే పత్రిక వుంది అని చెప్పవచ్చు.

1841 ఫిబ్రవరి 15 న ఒకాయన ఆ పత్రిక్కి ఆ ఉత్తరం రాశారు. దానిలో అంశం ఏమిటంటే...

అది దాదాపు నాలుగు పేజీల వుత్తరం. అందులో కొంతభాగం

*దేవదాసీల నాట్య ప్రదర్శనలు పెళ్లిళ్లలో పెట్టడం వలన నష్టాలే ఎక్కువ జరుగుతాయి. ఈ ప్రదర్శనలకు సుమారు 50 వరహాల నుండి 1000 రూపాయల వరకూ ఖర్చు చేస్తున్నారు. వీటివల్ల నష్టాలు ఏమిటంటే, ఈ నాట్యం ఏర్పాటు చేసిన వ్యక్తి, రాత్రంతా మేలుకొని ఉండాలి. పెళ్లి పెందలాడే అయిపోయినా సరే. అలాగే వచ్చిన వాళ్లలో చాలా మంది ఎటువైపు వాళ్ళో తెలీడం లేదు. అంటే, పెళ్ళికొడుకు తాలూకా వాళ్ళో, పెళ్లి కూతురు తాలూకా వాళ్ళో? వాళ్లేమో.. వీళ్ళనీ, వీళ్ళేమో వాళ్ళనీ అనుకుంటున్నారు. ఎవరెవరో వచ్చేసి నాట్య కచేరీల్లో కూర్చుంటున్నారు. ఇదొక నష్టం.*

*అలాగే నాట్యం చేసే ఆమె, అందరి వైపూ చూడలేదు కదా! ఎవరో ఒకరిద్దరి వైపే చూసి, నాట్యం చేస్తుంది. దాంతోటి ఆ వ్యక్తులు ఇంటికెళ్లి నిద్ర పోకుండా, రాత్రంతా ఆమె గురించే ఆలోచిస్తూ వుంటారు. ఇక నాట్యం చేసే దేవదాసీల విషయానికి వస్తే,* (అందులో వున్నది యధాతథంగా ఇక్కడ ఇస్తున్నాను. అప్పటి తెలుగు ఎలా ఉందో తెలుస్తుంది)

*నాలుగైదు రాత్రుళ్ళు కష్టపడి, నిద్ర మాని తన అభినయముల చేతనున్నూ, తానూ పాడే పదాల చేతనున్నూ, స్త్రీలకున్నూ, పురుషులకున్నూ వుండే మర్యాదలు తప్పి, సభలో నిలుచుండి, సౌమ్యుల చేతనున్నూ, కొన్ని రహస్యాలు బయలుచేసీ, లజ్జ విడిచీ, మానము చెడి, ఇంత కష్టపడ్డ వెనుక ఇంటి యజమానుడి వద్దకు వెళ్లి, "దేహీ!"అని అడిగితె... అతను ఇష్ట వచ్చిన మట్టుకు ఏమిచ్చినా తీసుకుపోతున్నారు. కనుక ఈ దేవదాసీలకు తగిన ఫల ప్రాప్తి లేదు. ఇదొక నష్టం.*

*నాట్య కచేరీలు చూడడానికి పిలకాయలు వస్తున్నారు. ఆ పిలకాయలు తెల్లవార్లూ నాట్య కచేరీలు చూసి, మరుచటి రోజు స్కూల్ కి వెళ్లకుండా, చదువులు చెడగొట్టుకుంటున్నారు. అందువల్ల నేను ఇచ్చే సలహా ఏమిటంటే, "ఈ నాట్య కచేరీలు మానేసి, బ్రాహ్మణుని అయినా గానీ, ఇతర వర్ణములలో మరో పురుషుడ్ని అయినా గానీ, రప్పించి కొంత సేపు భగవన్నామ కీర్తన చేయిస్తే, చేయించిన వారికీ, వినేవారికీ పరలోక సాధన కద్దు.*

*పత్రికలో తమరు ఈ కాగితాలన్నీ కడాకూ (అంటే, చివరి వరకూ) దీన్ని తమ ' వృత్తాంతిని' పత్రికలో ప్రచురించడం లోకోపకారముగా ఉండునని మీకు తోస్తే, ఆలాగున మీరు ప్రచురణ చేయుమని కోరుచున్నాను.*

మీరు అనుకుంటే, ప్రచురించండి. అలాగే దీన్ని చదివిన వాళ్ళు అందరూ మారిపోతారని అనుకోవడం లేదు. కాకపోతే, చెప్పాల్సిన బాధ్యత నా మీద వుంది. గాబట్టి, నేను చెబుతున్నాను.

అతని పేరు, చందా దారుడైన "లోక రక్షిణి" అని రాశాడు.

వృత్తాంతిని పత్రికలో ఎక్కువగా సమకాలీన వార్తలు మాత్రమే వస్తూవుండేవి. సాహిత్యం గురించిన వార్తలు ఎక్కువగా రాలేదు.




తరువాత పరిశోధనలకు దొరికిన పత్రిక "వర్తమాన తరంగిణి". ఇది 1842 లో మొదలయ్యింది. (ఈ పత్రికలన్నీ ఎక్కువ కాలం నడవలేదు. 5,10 సంవత్సరాలు మాత్రమే. మహా అయితే, 20 సంవత్సరాలు మించి నడచిన పత్రికలు తక్కువగా ఉండేవి.) ఈ "వర్తమాన తరంగిణి" పత్రిక పబ్లిషరు పేరు "సయ్యద్ రహం తుల్లా". దీని సంపాదకుడు "పువ్వాడ వెంకట్రావు" అనే వ్యక్తి. ఇది కూడా మద్రాస్ నుండే వచ్చేది. మాములు వార్తలతో పాటు, సాహిత్య సంబంధించిన అంశాలు ఉండడం ఈ 'వర్తమాన తరంగిణి' తోనే మొదలయ్యింది.

వాటిల్లో సాహిత్య అంశాలు ఉన్నాయని ఎలా తెలుస్తుంది? ఆ పత్రిక తొలి సంచికలో కావ్యాలూ, ప్రబంధకాలూ, శతకాలూ, ఒక పట్టికలాగా ఇచ్చారు. ఇవన్ని అందుబాటులో ఉన్నాయని. అంటే, ప్రింటింగ్ అని కాదు. సి. పి. బ్రౌన్ తాటాకు పత్రాల నుండి పేపర్లలోనికి రాయిస్తూ ఉండేవాడు. ఆ లిస్ట్ ఒకటి ఈ వర్తమాన తరంగిణిలో వేశారు. కాబట్టి, ఇందులో సాహిత్య విశేషాలు కూడా ఉండేవని తెలుస్తోంది. అలాగే ఈ వర్తమాన తరంగిణిలో "పరవస్తు చిన్నయ సూరి గారు" ఒక పద్యం రాసి, "ఈ పద్యానికి అర్థం చెప్పగలరేమో మిగతావాళ్ళని అడగండి. "అన్నారు.

అలాగే భాష కూడా ఆ వృత్తాంతిని పత్రికతో పోలిస్తే, కొంచెం సరళంగా ఉంటుంది. ఈ పత్రికను నడిపిన వంటి "పువ్వాడ వెంకట్రావు"గారు సి. పి. బ్రౌన్ గారికి ఒక వుత్తరం రాశారు.

" అయ్యా! మీరు మహా భారతాన్ని తాటాకు పత్రాల నుండి కాగితాల మీద రాయిస్తున్నారు కదా! దాన్ని మాకు పంపించండి. వాటిని మేము పుస్తకాలుగా ప్రింట్ చేస్తాము. ఇంతకు ముందు మీరు పంపిన మూడు పద్యాలూ అయిపోయాయి. ఇంకో పద్యం పంపించండి"అని. అంటే ఈ వర్తమాన తరంగిణి పత్రికతో పాటుగా ప్రింట్ పుస్తకాలు కూడా పబ్లిష్ చేసేవారని అర్థమౌతోంది.

ఆ తరువాత పత్రిక 1848 లో వచ్చింది. ఇది కూడా మద్రాస్ నుండే వచ్చేది. దీనిని ప్రచురించిన వ్యక్తి పేరు ఫాదర్ ఎడ్మన్డ్ జె. షార్కీ. ఈయన బందరులో ఉండేవాడు. ఈయన పేరు మీద ఒక గర్ల్స్ హై స్కూల్ కూడా ఉండేది.

ఆ షార్కీ గారు మద్రాస్ లో "హితవాది"అనే పత్రికను పబ్లిష్ చేసి, తెలుగు ప్రాంతాలలో పంచిపెడుతూ ఉండేవారు. అది కూడా పూర్తిగా క్రైస్తవ పత్రిక.

దాంట్లో "బుర్రా శేషాచల శాస్త్రి "అని ఒకాయన పనిచేస్తుండేవాడు. ఆయన 1852 లో సి.పి. బ్రౌన్ గారికి ఒక వుత్తరం రాశాడు.

"అయ్యా! నేను ఈ షార్కీ గారి దగ్గర పనిచేస్తున్నాను. ఈయన పత్రిక మూసేస్తున్నాడు. అందుకని నాకు వుద్యోగం పోతుంది. అందుకని మీరేమైనా పని ఇప్పించగలరా?"అని .

అప్పట్లో సి. పి. బ్రౌన్ గారు తెలుగు పండితుల్ని చేరదీసి, తాటాకుల మీద వున్న వాటిని కాగితాల మీద అక్షరబద్ధం చేయిస్తూ ఉండేవాడు. ఆ బుర్రా శేషాచల శాస్త్రి గారు రాసిన దాన్ని బట్టి "హితవాది "అనే పత్రిక ఉండేదని తెలుస్తున్నది.

వీటన్నిటి తర్వాత మనకు ఇప్పటికి కూడా చూడడానికి లభ్యం అయ్యే పత్రిక పేరు "సుజన రంజని". ఇది 1862 లో మొదలై 5 సంవత్సరాలు నడిచింది. దీనికి సంపాదకులు "వింజమూరు కృష్ణ మాచార్యులు గారు", బహుజన పల్లి సీతారామాచార్యులు గారూ, కారుమంచి సబ్బారాయులు నాయుడు గారూ.. వీళ్ళు ముగ్గురూ మద్రాస్ స్కూళ్లలో తెలుగు పండితులుగా ఉండేవారు. ఆ రోజుల్లో బ్రిటీష్ వాళ్ళు ప్రచురించిన ఒక పత్రిక "జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్"ని చూసి ఆ మార్గంలో తెలుగు విద్యార్థులకు కూడా ఒకట పత్రిక ఉంటే బాగుంటుంది అని ఈ "సుజన రంజని" ప్రారంభించారు. ముఖ్యంగా తెలుగు ప్రధాన అంశంగా చదివే విద్యార్థులకు ఉపయోగ పడాలి అనేది ఈ పత్రిక యొక్క ప్రధాన అంశంగా కనబడుతోంది.




ఈ పత్రికలో ఏం రాసారంటే.. "ఏ ఫ్రెండ్ టూ ది యూనివర్సిటీ స్టూడెంట్ "(యూనివర్సిటీ పరీక్ష విద్యార్థులకు ఉపకరణకు ) ఈ కోణంలో చూస్తే, మొట్ట

మొదటిసారిగా విద్యార్థుల కోసం అవసరమైనటు  పత్రిక 1862 లోనే "సుజన రంజని" పేరుతో వచ్చిందని మనం అంగీకరించాలి.

ఇది తెలుగు ప్రధానంగా వున్న విద్యార్థులకు కాబట్టి, వాళ్లకు ఉండే ప్రశ్నపత్రాలూ, వాటికి జవాబులూ. పాత ప్రశ్నపత్రాలతో పాటుగా, ముఖ్యంగా ప్రాచీన సాహిత్యం  గురించి 4 పేజీలో, 8 పేజీలో ఉంటూ ఉండేది. దాన్ని బట్టి చూస్తే, దీన్ని సాహిత్య పత్రిక అని కూడా చెప్పుకోవచ్చు. దీంట్లో నుండి ఒక ఉదాహరణ. 1867 ఫిబ్రవరి నాటి సంచికలో 1866 లో మెట్రిక్యులేషన్ లో అడిగినటువంటి తెలుగు పేపర్లలో ప్రశ్నలు అని ఒక లిస్ట్ ఇచ్చారు. ఒకటి, రెండు ప్రశ్నలు చూద్దాం.

రాముడు అయోధ్య విడిచి, అడవికి పోయినపుడు అతని వయసు ఎంత? అడవికి పోయిన ఎన్ని రోజులకు దశరధుడు మృతి చెందాడు? వీటికి సత్వరణముగా ఉత్తరము వ్రాయుము.

మరొక ప్రశ్న "రాముని భార్యకు "వేదినీ తనయా, సీత అనే పేర్లు ఎలా వచ్చాయి?"ఇక్కడ నేను మామూలు తెలుగులో చెబుతున్నాను. అక్కడ గ్రాంథికంలో ఉంటుంది. అప్పట్లో  మెట్రిక్యులేషన్ వారికి అలాంటి తెలుగు సబ్జెక్ట్ ప్రశ్నలు అడుగుతుండేవారు.

తరువాత పత్రిక "ఆంధ్ర భాషా సంజీవనీ" ఇది 1872 లో వచ్చింది. దీనిని నడిపిన వారు"కొక్కొండ వెంకట రత్నం పంతులు గారు" ఈయనకు గ్రాంధిక భాషాభిమానం ఎక్కువగా ఉండేది. ఈయనను "మహా మహోపాధ్యాయ "అని అంటుండేవారు. ఈ కొక్కొండ వెంకటరత్నం గారి గురించి ఒక విశేషం ఏమిటంటే, మాములు సంభాషణ కూడా ఆయన గ్రాంధిక భాష లోనే మాట్లాడేవారట. గ్రాంధిక భాషంటే అంత ఆసక్తి, అంత ప్రేమా ఉండేదట. ఆయన ప్రారంభించిన పత్రికే "ఆంధ్ర బాషా సంజీవనీ".  సంపాదకీయం (ఎడిటోరియల్ ) ఈ పత్రిక తోనే మొదలయ్యింది. అతను ముందు 40 సంవత్సరాలుగా తెలుగు పత్రికలు వచ్చినా సంపాదకుడు తన మాట, తాను ఎప్పుడూ వ్రాయలేదు.

ఈ పత్రికలో గ్రంథ సమీక్షలూ, సాంఘిక, రాజకీయ విషయాలూ, అలాగే, వార్తలూ, సాహిత్యమూ కూడా ఉండేవి. వీరేశలింగం గారు మొట్ట మొదటి సారిగా వ్రాసిన "శుద్ధాంధ్ర భారతం, సభా పర్వం"అనే తొలి పద్య కావ్యాన్ని ఈ "ఆంధ్ర భాషా సంజీవనీ"లోనే ప్రచురించారు. అలాగే, "ఎలిజీలు"అంటారు. అంటే, ఎవరైనా చనిపోతే రాస్తారు కదా!  "వడ్డాది సుబ్బారాయుడు"గారి ఎలిజీ కూడా ఈ ఆంధ్ర బాషా సంజీవనీ లోనే వుంది.

ఇంకో ఆసక్తికరమైన విశేషం ఏమిటంటే, అప్పటి వరకూ పత్రికల్లో సంపాదకుడూ, విలేఖరీ, చందాదారుడూ, చదువరీ ఇలాంటి వాటికి అంత వరకూ ఎవరూ స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. ఈ పత్రికలో ఎవరి బాధ్యతలు

ఏమిటి? ఎవరి గుణాలు ఏమిటి? అనేవి వ్రాసారు. ఎవరికి ఎలాంటి లక్షణాలు ఉండాలి?అనేవి రాశారు. అయితే వాటిని పద్య రూపంలో రాశారు. పాఠకుడి లక్షణాలు ఒక పద్యం చూద్దాం. పాఠకుడు అనేవాడు ఎలా ఉండాలంటే...

"పత్రిక చెడగొట్టకుండా పై కప్పు నెడలింప వలయును"(అంటే పోస్ట్ లో, పేక్ చేసి వచ్చినప్పుడు పత్రిక చిరిగి పోకుండా పైనున్న కవరు చించాలి. "విప్పంగ వలయునట్లే".

"స్వవిషయములు ముందు చదువ వలయు"(పుస్తకం ఓపెన్ చేసాక ముందు శీర్షికలు చూడాలి) ఎవరికిష్టమైనవి వాళ్ళు ముందుగా చదువుకోవాలి. "అంతట తన వారికి పైన విషయములు పరికింపవలె"తరువాత మిగతా విషయాలు. తనకి అత్యంత ఆసక్తిలేని విషయాలు చదవాలి. "అంతః పర విషయములు అరగంగ వలయును. ఏకాగ్ర మనస్కుడై మడత మాన్పగ రాదు. ముడుతలు పడనీయక " (పుస్తకం చదివేటప్పుడు ముడుతలు పడకూడదు. "నలగనీయక"(నలపకుండా) "ఎప్పటియేట్లో నందుంచి"(పోస్ట్ లో వచ్చినపుడు ఎలా వుందో అలాగే ఉంచి)దానినట్లే ఒప్పునతడు, సవాలక్ష నుండు ఒరకున్న పాఠకు డెట్లగును? ( ఈ లక్షణాలు లేకపోతే, అసలు మామూలు పాఠకుడు ఎలా అవుతాడు?)

తరువాత పత్రిక "పురుషార్థ ప్రధాయిని"ఇది బందరు నుండి వచ్చేది. దీనిని "ఉమా రంగనాయకులు "అనే ఆయన చూసేవారు. ఈ "పురుషార్థ ప్రదాయిని" 20 సంవత్సరాల పాటు ఆగిపోకుండా వచ్చింది. ఈ పత్రిక పూర్తి పేరు "దైవ సమాజిని పురుషార్థ ప్రధాయిని ".

. ఇది 1872 నుండి 92 వరకూ వచ్చింది ఇంకో విశేషం ఏమిటంటే, ఈ పత్రికలు అన్నిటినీ గమనిస్తే, ఆంధ్ర దేశంలో పలు ప్రాంతాలనుండి వస్తూ ఉండేవి. ముందు మద్రాస్. తరువాత నెల్లూరూ, బళ్లారీ, బందరూ, శ్రీకాకుళం, రాజమండ్రీ, కాకినాడా అన్ని ప్రాంతాలనుండి వచ్చేవి.

అలాంటి నేపథ్యం నుండి ప్రారంభం అయిన పత్రిక "దైవ సామాజిని పురుషార్థ ప్రధాయిని". దీని ప్రత్యేకత – మొట్ట మొదటి సరిగా తెలుగును ఇంగ్లీష్ లో రాశారు. అప్పట్లో వచ్చిన ఇంగ్లీష్ దొరలు, తెలుగు దేశంలో బ్రతకాలి కాబట్టి, తెలుగు నేర్చుకుంటుండేవారు. అందుకని, తెలుగు పద్యానికి ఇంగ్లీష్ లో ప్రతి పదార్థం రాసేవారు. అదే కాకుండా, ఒక ఇంగ్లీష్ లో ఒక సెక్షన్ కూడా సెపరేట్ గా ఉండేది. అలాగే పత్రికలో ఏమేమి వుంటాయో కూడా రాశారు.

"శాస్త్రమూ, భాషా, మతమూ, వైద్యమూ, ఔషధమూ, వ్యవసాయమూ, కళలూ, వర్తకమూ, చేతి పనులూ, వినోదమూ... ఇలా అన్ని విభాగములను కూడా మేము స్పృశిస్తాము."అని చెప్పుకున్నారు. అందులో1872 ప్రాంతాల్లో వచ్చినటు ఒక వార్త.

*"ఓ.. ! పురుషార్థ ప్రయోధోత్తమా! ఈ విశేషము వింటిరా? ఈ విశేషము వింటిరా?(మీరు విన్నారా ఈ మాట?) కొంత మంది తాసీల్దార్లు లాంటి వాళ్ళు బళ్ళలో వెళ్ళేటప్పుడు  వాళ్ళు రోడ్డు పక్కన కూర్చోనేటప్పుడు వాళ్ళందరినీ "నేను బండిలో వెళ్లుచున్నాను. నేను తాసిల్దారుని. నువ్వు నాకు నమస్కారము పెట్టు" అనేవారట.*

*ఆ రోడ్డు పక్కన కూర్చునేవారు, నమస్కారము పెడితే.. అది తాసిల్దారుకు పెడుతున్నారా? బండికి పెడుతున్నారా? అనేది ఎలా తెలుస్తుంది? అయినా ఆ తాసిల్దారుకు ఇంత అహంభావం తగదు. ఆయనేదో ఇవాళ తాసిల్దారు అయ్యాడు కాబట్టి, నమస్కారం పెట్టమంటున్నాడు. ఆ పదవి నుండి వెళ్ళిపోతే, ఏం అవుతాడు? అధికారం అనేది ఒక వస్త్రం లాంటిది. ఆ వస్త్రం ధరించేది, ఆ వేషం ఉన్నంత వరకే. ఆ పాత్ర ఉన్నంత వరకే ఆయనకు విలువ ఉంటుంది. కావాలని ఇలా దండాలు పెట్టించుకోవడం మంచిది కాదు"*


దాంట్లో ఒక 'రిడిల్ ' కూడా ఇచ్చారు.  ఆ "రిడిల్" (క్విజ్) ఏమిటంటే... "ఏ విధంగా వేస్తారో నాలుగు, 9లను వెయ్యండి. ఇష్టం వచ్చినట్టు వెయ్యండి. గణిత శాస్త్ర ప్రకారం 100 రావలయును.  . కూడడమూ, తీసివేతా, భాగారమూ ఎలాగైనా సరే 100 రావాలి."

ఆ తరువాత చెప్పుకోదగ్గ పత్రిక "వివేక వర్ధిని". ఇది 1873 లో మొదలై, 1893 వరకు అంటే దాదాపు 20 సంవత్సరాలు నడిచింది. ఇది చాలా ప్రసిద్ధమైన పత్రిక.  ఈ పత్రికను నడిపినవారు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. ఈయన పత్రికల్లో కొత్త వరవడిని తీసుకువచ్చారు.  పత్రిక అనేది కేవలం వ్యాసాలు రాయడం, సాహిత్య సంబంధమైనటువంటి అంశాలే కాకుండా... 'పత్రికను సంఘ సంస్కరణకు కూడా ఉపయోగించవచ్చు' అని వివేక వర్ధిని పత్రిక ద్వారా నిరూపించిన వ్యక్తి వీరేశలింగం పంతులుగారు.

అప్పట్లో ఇన్వెస్టగేటివ్ జర్నలిజం రాస్తూండేవారు. లంచాలు తీసుకునే వాళ్ళ గురించీ, సమాజంలో చెడ్డ పనులు చేసే వాళ్ళ గురించీ పత్రికల్లో బహిర్గతం చేస్తుండేవారు. ఉదాహరణకు పత్రికల్లో ఒక వార్త రాశారు. అప్పట్లో మునిసిపల్ కౌన్సిలర్లను "కమీషనర్లు "అనే వారట. వాళ్ళు ఎలా వుంటున్నారంటే...


"మునిసిపల్ సమావేశాలకు వెళ్ళినపుడు పైనున్న డిప్యూటీ కలెక్టరూ, తాసిల్దరూ ఇలాంటి వాళ్ళ దగ్గర "చిత్తం... చిత్తం... " అనడమే కానీ, వాళ్ళ భావాల్ని ఏవీ ప్రకటించడం లేదు. కౌన్సిలర్లు కేవలం బానిసల్లాగా వుంటున్నారు. ఎందుకీ కౌన్సిలర్లను ఎన్నుకోవడం? " అని  ఘాటుగా రాశారు వీరేశలింగం పంతులుగారు.

అలాగే "ఫలానా వీధిలో కిరసనాయిలు దీపం వెలగడం లేదు. కిరసనాయిలు పంపించవలసిన కమీషనర్ పంపించడం లేదు. ఇంట్లోకి వాడేసుకుంటున్నాడా ఏమిటి  ? దీపాలన్నీ గుడ్డిగా వెలుగుతున్నాయి."అని వ్రాశారు. ఇలా ఒక పత్రికను సమాజ సంక్షేమం కోసం, సంఘ సంస్కరణ కోసం ఉపయోగించిన మొట్టమొదటి వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు గారు.





ఆయన ఈ ఒక్క పత్రికే కాకుండా, శ్రీ చింతామణి, సతీ హితభోధిని, సత్య వాది అని ఇలాంటి పత్రికలు కూడా ప్రారంభించారు.

తరువాత వచ్చిన పత్రిక “జన వినోదిని”. ఇది 1875 నుండి ఒక 10 సంవత్సరాలపాటు వచ్చింది.దీన్ని గురించిన వివరాలు పెద్దగా లభ్యం కావడం లేదు. కందుకూరి వీరేశలింగంగారు ‘వివేకవర్ధిని’ నడుపుతున్న రోజుల్లోనే, దానికి సమాంతరంగా “కృష్ణ మాచార్యులు “అనే ఆయన నడిపారు. ఇది మొట్ట మొదటి పిల్లల పత్రిక. అంటే,




తరువాత పత్రిక “అముద్రిత గ్రంథ చింతామణి” ఇది నెల్లూరు నుండి వచ్చేది. దీని సంపాదకుడు పూండ్ల రామకృష్ణయ్య గారు. పత్రిక పేరులోనే వుంది అందులో ఏముంటుంది అనేది. “అముద్రిత గ్రంథ చింతామణి” అంటే అప్పటి వరకూ ముద్రితం కాని, గ్రంధాలను ఈ పత్రికలో వేస్తాము” అనే ఉద్దేశ్యంతో ఈ పత్రికను ప్రారంభించారు.

ఇందులో గ్రంథ సమీక్షలూ, అలాగే ప్రాచీన గ్రంథాలను సమీక్షించడం. అసలు అవి ఏ కాలానికి చెందినవి?ఎవరు రాశారు?వాళ్ళే రాశారా?తరువాత ఎలా మారుతూ వచ్చింది?ఇలాంటి పరిశోధనలు రాస్తుండేవారు.





తరువాత చెప్పుకోదగ్గ పత్రిక "చింతామణి"ఇది 1890 లో మొదలయ్యి దాదాపు 8 సంవత్సరములు నడించింది. ఈ చింతామణి పత్రిక కూడా రాజమండ్రి నుండే వచ్చేది. దీని ప్రత్యేకత ఏమిటంటే.. మొట్ట మొదటిసారిగా నవలల పోటీ ప్రారంభించింది ఈ చింతామణి పత్రికే.

1893 జూన్ లో ఈ పోటీలు పెట్టారు. అప్పటికి ఇంకా "నవల"అనే పదం వాడుకలో లేదు. దాన్ని "వచన ప్రబంధం "అనే వాళ్ళు. ఈ పత్రికలో "వచన ప్రబంధం "పోటీలు ప్రకటిస్తూ.. దానికి ఉండవలసిన షరతులు రాశారు. "ప్రబంధం (నోవలెట్ (novelette) "అని రాశారు.


ప్రభంధంలో ముద్రితమైనపుడు, మాస పత్రికలో 50 పుటలకు తక్కువ కాకుండా ఉండవలయును. అలాగే ఈ నవలలు పంపించేటప్పుడు మరికొన్ని కండీషన్స్ కూడా రాశారు. "మొదటి పేజీలో మీ పేరు రాయవద్దు. విడిగా రాయండి"

అలాగే ఈ వచన ప్రబంధం రాసేటప్పుడు, "మీరు ఏ పురాణం నుండో, ప్రబంధం నుండో రాస్తారు కదా!ఆ మూల కథను, దాని ఔచిత్యం చెడకుండా రాయండి"

ఇలాంటి సూచనలు కూడా ఇచ్చారు. మీరు పంపినటువంటి వచన ప్రబంధాన్ని, అంటే, నవలను, మహారాజశ్రీ వావిలాల వాసుదేవశాస్త్రి గారూ, కందుకూరి వీరేశలింగం గారూ, అలాగే 'చింతామణి' పత్రిక నిర్వాహకులు న్యాపతి సుబ్బారావు గారూ, వీళ్ళందరూ కలసి, మొదటి రెండు బహుమతులూ కలసి నిర్ణయిస్తారు. "మొదటి బహుమతి 75 రూపాయలూ, రెండవ బహుమతి 50 రూపాయలూ" అని ప్రకటించారు. 1893 జూలై నెల సంచిలో దాని ఫలితాలు కూడా వున్నాయి.




రెండు నవలలకు బహుమతులు ఇస్తారని అన్నారు కదా! వాళ్లకి వచ్చిన నవలలు మూడు. “ఖండవల్లి రామ భద్రుడు “అనే ఆయన “ధర్మవతి విలాసం”అనే ప్రబంధాన్ని రాశారు. రెండో ప్రబంధం “తల్లా ప్రగాడ సూర్యనారాయణ”అనే ఆయన వ్రాసిన “సంజీవరాయ చరిత”అనేది. వీళ్లిద్దరికీ బహుమతులు ఇస్తున్నాం. అయితే, మొత్తం మూడు వచ్చాయి. “మూడవదాన్ని వదిలేస్తే, బాగుండదు. అని న్యాయనిర్ణేతల్లో ఒకరైన “వావిలాల వాసుదేవ శాస్త్రి గారు అన్నారు. అందువల్ల మూడవ దానికి కూడా బహుమతి ఇవ్వడానికి ఎవరైనా దాతలు ముందుకు దానికి కూడా బహుమతి ఇస్తాము” అని రాశారు.




ఆ విధంగా నవలల పోటీ 1892 లో మూడు నవలలు రావడంతో ప్రారంభమయ్యింది. తరువాత సంవత్సరం “చింతామణి “పత్రికలో వచ్చిన నవలల పోటీలో వరసగా బహుమతులు పొందిన వ్యక్తి చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు.

నవల అనే పదప్రయోగం ఎలా మొదలైందంటే – 1896 లో “కాశీ భట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు” అనే ఆయన ‘కందుకూరి వీరేశ లింగం గారు ‘వ్రాసిన “రాజశేఖర చరిత్ర”అనే వచన ప్రబంధానికి ‘నవల’ అని పేరు పెట్టారు. .

తరువాత పత్రిక “సతీ హితబోధిని”. ఇది 1885 లోనే మొదలయ్యింది. ఇది కూడా రాజమండ్రి నుండి వీరేశలింగం పంతులు గారే ప్రారంభించారు. ఇది స్త్రీల కోసం ప్రారంభించిన మొట్టమొదటి పత్రిక. ఈ మహిళల

పత్రిక అయిన "సతీ హితబోధిని "కూడా మాస పత్రికే. ఒక్క వీరేశలింగం పంతులు గారే తన 'వివేక వర్ధిని' ని మాస పత్రిక నుండి పక్ష పత్రికా, వార పత్రికా చేశారు గానీ, ఎక్కువగా వచ్చేవన్నీ మాస పత్రికలే. ఈ సతీ హిత బోధిని లో.. "స్త్రీల నిమిత్తమూ మాసమునకొక పత్రిక" అని రాశారు. వీటిలో స్త్రీలకు అవసరమైన వ్రత కథలతో బాటు బయాలజీ శాస్త్ర విజ్ఞానం, నీతి కథలు కూడా చేర్చారు.




తరువాత మనం చెప్పుకోబోయే పత్రిక 1900 సంవత్సరాల లోపులోనే వచ్చింది. 1895 లో "బాలిక" అనే పత్రిక. ఇది కూడా స్త్రీల కోసం వచ్చిన పత్రికే. ఈ బాలిక పత్రికను సంగీతరావు బాపిరాజు పంతులు అనే ఆయన నడిపేవారు. చికాకోలు నుండి వచ్చేది. చికాకోలు అంటే "శ్రీకాకుళం ". విజయనగరం దగ్గర వున్న శ్రీకాకుళం. నుండి ఈ పత్రిక మొదలయ్యింది. రెండున్నర అణాలు చందా. అదే శ్రీకాకుళంలో వుండే వాళ్లకయితే తక్కువ. ఎందుకంటే, పోస్టులో పంపించనవసం లేదు కదా! అది 1895 నుండి 5,6 సంవత్సరాలు నడిచినట్లున్నది.

ఆ తరువాత 1900 సంవత్సరాల్లో వచ్చిన పత్రికల్లో "విజ్ఞాన వర్ధిని". 1894 లో మొదలయ్యింది. దీన్ని మొట్ట మొదటసారిగా వచ్చిన సైన్స్ పత్రిక అని చెప్పుకోవచ్చు. ఇది పక్ష పత్రికగా వచ్చింది. రాయదుర్గం నుండి వచ్చేది. దాన్ని నడిపినాయన "యల్లంరాజు నారాయణ మూర్తి గారు"

అలాగే 1893 లో జ్ఞానోదయం అనే మరో పత్రిక కూడా వచ్చేది. దాన్ని నడిపినవారు "దాసు కేశవరావు గారు"ఇది మొట్ట మొదటి రైతు పత్రిక. ఇందులో వడ్ల బాగు, వర్తకం, పశువుల పెంపకం, ఇలాంటివి ఉండేవి.

ఇవండీ 1900 సంవత్సరాల లోపు వచ్చిన పత్రికలు. వాటికి వున్న ప్రత్యేకతల దృష్ట్యా కొన్నిటి గురించి చెప్పాను. తరువాత 1900 నుండి 1950 వరకూ భారత దేశంలోనూ, ఆంధ్రదేశంలోనూ అనేక పరిణామాలు సంభవించాయి. అవి జరిగినప్పుడు, అప్పటి పేపర్ల స్పందన ఎలా ఉందీ ఆ విశేషాలు తరవాత భాగం లో తెలుసుకుందాం.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 ఆగస్టు 4 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS